క్లుప్తంగా

సామర్లకోటలో నిలచిన రెండు రైళ్లు

సామర్లకోట: నిడదవోలు రైల్వే జంక్షన్ వద్ద మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న 22837 హతియా-యర్నాకులం ఎక్స్‌ప్రెస్, 22842 సంత్రగచ్చి-తంబరం ఏసీ ఎక్స్‌ప్రెస్‌లు సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 15 నిమిషాలు చొప్పున నిలిచి పొయాయి. రైల్వే ట్రాకు లైనుకు క్లియరెన్సు రావడంతో స్టేషన్ ఎస్ఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో రైళ్లను విడిచి పెట్టారు.

సుబ్బారావు ఆరోగ్యం కోసం పూజలు



ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న కౌన్సిలర్లు

సామర్లకోట: పాము కాటుకు గురైన హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు తండ్రి సుబ్బారావు ఆరోగ్యం మెరుగుపడాలని ఆయన అభిమానులు మంగళవారం స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సాయంత్రం పొలానికి వెళ్లిన సుబ్బారావును పాము కాటు వేసిన విషయం తెలిసిందే. ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, కౌన్సిలర్లు తదితరులు సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మన్ మంజూరు

సామర్లకోట: ప్రభుత్వ హైస్కూళ్లలో నైట్ వాచ్ మెన్‌ను నియమించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. కొన్నేళ్లుగా హైస్కూల్‌లో నైట్ వాచ్‌మన్‌లు లేక పోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. నైట్ వాచ్‌మెన్‌కు రూ.ఆరు వేలు జీతం ఉంటుందని చెప్పారు. పాఠశాల ముగిసిన సమయం నుంచి విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచి కండేపల్లి సత్యశ్రీ అన్నారు. కొమరగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ తాగేందుకు ప్రభుత్వం అందించిన స్టీల్ గ్లాసులను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రాగిజావ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారమన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి చంటిబాబు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

కొత్తపల్లి: గంధామవాస్యను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల జాతరలు, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పొన్నాడ శివారు రావివారి పోడులో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి జాతర మంగళవారం రాత్రి వేడుకగా జరిగింది. వాకతిప్పలో వేంచేసి ఉన్న గ్రామ దేవత ఆదిలక్ష్మి బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

లాయర్ వీరభద్రరావుకు సత్కారం



వీరభద్రరావు దంపతులను సత్కరించిన విలేకర్లు

సామర్లకోట: స్థానిక న్యాయవాదిగా ఉంటూ రెండో పర్యాయం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కోర్లమండ వీరభద్రరావు దంపతులను స్థానిక విలేకర్లు మంగళవారం సత్కరించారు. స్థానిక విలేకర్ల అసోసియేషన్ కార్యాలయంలో వీరభద్రరావు అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ కౌన్సిలర్ కోర్లమండ శ్రీవాణి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి శ్రీభీమేశ్వర జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పలపాటి చంద్రయ్యదాసు అధ్యక్షత వహించగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి చెంతకు బాలుడు

సామర్లకోట: ఇంటి నుంచి వచ్చేసిన బాలుడిని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి అతడి తండ్రికి అప్పగించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని సమాచారం సేకరించారు. మండలంలోని ఉలిమేశ్వరం గ్రామానికి చెందిన అడబాల వెంకట్‌గా గుర్తించి, అతడి తండ్రి దుర్గాప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. తండ్రి మందలించడంతో వెంకట్ ఇంటి నుంచి వచ్చేసినట్టు తండ్రి తెలిపాడు. ఆయనకు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

రెవెన్యూ పనుల్లో జాప్యం తగదు

- అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి
- మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం



పనుల జాప్యంపై డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీస్తున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: అధికారుల తీరుపై ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన మండల పరిషత్ పాలక వర్గ సమావేశం జరిగింది. రెవెన్యూ శాఖలో పనులు జరగడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీబీ దేవం గ్రామంలో జరిగిన లే అవుట్‌ల ప్లాన్లు ఇవ్వాలని ఆరు నెలలుగా కోరుతున్నా ఇప్పటి వరకు స్పందించలేదని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఆరోపించారు. ఇటువంటి సమయంలో రిజర్వుడు స్థలం ఎక్కడ ఉందో పంచాయతీకి ఎలా తెలుస్తుందని సూరిబాబు ప్రశ్నించారు. తహసీల్దార్‌తో చర్చించి సమస్య పరిష్కరిస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పేర్నిడి వెంకట్రాయుడు, ములసా శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు శివ కోటి శివనాగ కృష్ణ ఆరోపించారు. డిప్యూటీ తహసీల్దార్ నుంచి సరైన సమాధానం రాక పోవడంతో తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకువెళతానని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ప్రజలకు అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులకు అందేలా చూడాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఏఓ ఐ.సత్య మాట్లాడుతూ మండలంలో 80 శాతం బొండాలను పండించారని, అయితే కష్టం అయినా ప్రభుత్వం కొనుగోలుకు ప్రయత్నిస్తుందన్నారు. దాళ్వా కోతలు పూర్తయిన తరువాత మూడో పంటగా అపరాలు సాగు చేసుకొవడానికి ఆర్బీకేలలో పెసలు, మినుములు, పిల్లి పెసర సబ్సిడీకి అందజేయనున్నట్టు చెప్పారు. హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర రావు మట్లాడుతూ సొంత స్థలాలు కలిగి ఉన్న 988 మంది గృహ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. అందరికీ రుణాలు మంజూరయ్యేలా చూడాలని ఎంపీపీ సూచించారు. మాధవపట్నంలో అదనపు ట్రాన్సుఫార్మర్లు కావాలని చెప్పినా ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు మేడిశెట్టి దుర్గాదేవి ఆరోపించారు. హుస్సేన్‌పురం గ్రామంలో రోడ్డుకు మధ్యలో వేసిన విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని ఆ గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి ఆరోపించారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తయ్యేలా ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. వీకే రాయపురంలోని తూటేరు డ్రైన్‌లో పూడిక తీయించాలని కలెక్టరుకు రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారని, దీనిపై దృష్టి సారిస్తున్నట్లు డ్రైన్ల ఏఈ రేష్మ తెలిపారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిధులున్నా పనులు చేయరేం?



పాఠశాల పనులపై మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీఓలు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనులకు నిధులు ఉన్నా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రశ్నించారు. మంగళవారం ఎంపీపీ చాంబరులో పాఠశాల హెచ్ఎం, విద్యా కమిటీ చైర్మన్, కాంట్రాక్టరుతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మొదటి అంతస్తులోని తరగతి గదులకు ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయక పోవడం వల్ల అదే గదిలో విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాల్సి వచ్చిందని విద్యా కమిటీ చైర్మన్ చంద్రు సత్తిబాబు ఆరోపించారు. ప్రస్తుతం రూ.15 లక్షలు నిధులు ఉన్నా పనులు ఎందుకు చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. దీంతో పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ చెప్పడంతో నిధులు ఉన్నాయని, సమయంలో బిల్లులు చెల్లించి పనులు జరిగేలా చూడాలని, కాంట్రాక్టరు పనులు నచ్చక పోతే మరోకరితో పనులు చేయించుకోవాలని ఎంపీపీ సత్తిబాబు, ఎంపీడీఓ డి శ్రీలలితలు హెచ్ఎం పి.అనురాధకు సూచించారు. మండల ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకే బిల్లులు చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

సైకిల్‌పై 14 రాష్ట్రాలు చుట్టేశాడు..!

- దేశ శాంతిని కోరుతూ దైవ దర్శనం
- 404 రోజులు యాత్రలో ఉన్న సింధనూర్ పట్టణవాసి



పిఠాపురం చేరుకున్న విజయ్ గోపాలకృష్ణ

పిఠాపురం: దేశంలో శాంతి నెలకొల్పాలని భగవంతుడిని కోరుకుంటూ ఏకంగా 14 రాష్ట్రాలు సైకిల్‌పై చుట్టేశారు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింధనూర్ పట్టణానికి చెందిన విజయ్ గోపాలకృష్ణ. దేశ శాంతి కోరుతూ దైవ దర్శనం కోసం సైకిల్ యాత్ర ప్రారంభించిన ఆయన మంగళవారం పిఠాపురం చేరుకుని పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ 2003 గోదావరి పుష్కరాలకు సైకిల్‌పై వచ్చానని, దేశ మంతా సైకిల్ యాత్ర చేయాలని సంకల్పించినట్టు తెలిపారు. 2022 మార్చి 11న తన సైకిల్ యాత్రను సింధనూర్‌లో ప్రారంభించి, ఇప్పటి వరకూ 404 రోజులు బ్రహ్మపుత్ర నది తప్ప 11 నదులు తిరిగానని తెలిపారు. 14 రాష్ట్రాల్లో 32 వేల కిలోమీటర్ల దూరం పర్యటించి ప్రముఖ దేవాలయాలు నదులు సందర్శిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం తన యాత్ర చివరి దశకు చేరుకుందని ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రముఖ దేవాలయాలు సందర్శన అనంతరం తిరిగి తన స్వగ్రామం చేరుకుంటానని తెలిపారు. తన స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం కామరవరం అని, 40 ఏళ్ల క్రితం తన తండ్రి వ్యాపార నిమిత్తం కర్ణాటక రాష్ట్రం వెళ్లి అక్కడ స్థిరపడ్డారని ఆయన తెలిపారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మంగళవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారు కుమారా రామభీమేశ్వరస్వామికి తెల్లవారు జామున అభిషేకాలు, అనంతరం పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి పూజ చేశారు. స్వామికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారాజు, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్, సన్నిధిరాజు రాంబాబులు పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు భక్తులకు సేవలందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అన్నారు. కొమరగిరిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. వారి అనుమతితో ఇంటికి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కంచన సుమమాల, నరుకుర్తి వెంకటలక్ష్మి దాసరి చంద్రరావు, చింతాకుల స్వామి, కఠారి చంటిబాబు, పులగల రాజేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు ఉన్నారు.

ముంపు తీరే మార్గమేదీ..?

- పంట కాలువలో పెరిగిపోయిన పూడిక
- నీరు దిగక పంటలు నీట మునక
- ఉపాధి పనుల్లో చేయించాలంటున్న రైతులు



వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల మధ్య పూడికతో నిండిపోయిన తూటేరు డ్రైను

సామర్లకోట: డ్రైనేజీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏటా వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లో చేతికి అందే పంట నీట మునిగిపోతోంది. పంట కాలువలో పూడిగ పెరిగి పోవడం వల్ల వర్షాలు వచ్చిన సమయంలో పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేక పంటలు తరచూ ముంపునకు గురవుతున్నాయని వీకే రాయపురం, బోయనపూడి, అచ్యుతాపురత్రయానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలలో అదనంగా ఉన్న నీరు తూటేరు డ్రైను మీదుగా సముద్రం లోకి వెళ్లాల్సి ఉంది. ఏడేళ్లగా తూటేరు డ్రైనులో పూడిక తీయక పోవడంతో నీరుపాయే మార్గం లేకుండా పోయింది. దాంతో తరుచూ పంట నీటమునిగి రైతులు నష్ట పాతున్నా డ్రైనేజీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతి గ్రామానికి ఉపాధి హామీ పనులు గుర్తించే సమయంలో రైతులకు ఎంతో మేలు కలిగించే తూటేరు డ్రైనులో పూడికతీతను ఉపాధి హామీలో ఎందుకు పెట్టడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడైనా ఉపాధి హామీ పనులు గుర్తించే సమయంలో పంట కాలువలో పూడిక తీతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీలో నిధులు కేటాయించి ఆ నిధులతో జెసీబీ ద్వారా మాత్రమే పూడిక తీసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కూలీలతో పూడిక తీత సాధ్యం కాదని పలువురు అంటున్నారు.

ఇరిగేషన్, డ్రైనేజీ అధికారుల నిర్లక్ష్యం



డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఏటా నష్టపోతున్నారు. వీకే రాయపురంలో ఉన్న తూటేరు డ్రైనులో ఏడేళ్లగా పూడిగ తీయలేదు. దాంతో పొలాలోని అదనపు నీరు పాయే మార్గం కనిపించడం లేదు. ప్రస్తుత వేసవి కాలంలో గోదావరి కాలువ కట్టి వేసే సమయంలో పూడిక తీయించే ఏర్పాట్లు చేయాలి. ఈ మేరకు పంట కాలువలో పూడికతీతకు ఉపాధి హామీలో గుర్తించాలి.

– గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఉప సర్పంచ్, వీకే రాయపురం

రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం



వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన పొలాల్లోని అదనపు నీరు బయటకు పోవడం లేదు. దాంతో పొలాలు తరుచూ ముంపునకు గురవుతున్నాయి. తూటేరు డ్రైనులో పూడిక తీయాల్సి ఉంది. ఉపాధి హామీ పనులు గుర్తించే సమయంలో పంట కాలువలో పూడిక తీతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి హామీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాను.

– ఐ.సత్య, వ్యవసాయాధికారి, సామర్లకోట



పాత ఇసుకపల్లిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

సంక్షేమానికి చిరునామా జగన్ పాలన

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పాత ఇసుకపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: రాష్ట్రంలో సంక్షేమానికి చిరునామా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పాత ఇసుకపల్లిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మహిళలు మురుగునీరు, వర్షపు నీరు పోయే మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని డ్రైనేజీలు ఏర్పాటు చేయించాలని కోరారు. దీనిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యతమిస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ గత ఎన్నికల్లో టీడీపీ నన్ను మోసగించిందంటూ మొసలి కన్నీరు పెట్టి ప్రజలను నమ్మించి మోసగించిన సంగతి నియోజకవర్గ ప్రజలకు తెలిసిందేనన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మరో కొత్త నాటకానికి తెర తీస్తున్నారని, ఏం అభివృద్ధి చేశావని గ్రామాల్లో పర్యటిస్తావు, ప్రజలు నీ కొడతారన్నారు. వర్మా నీ ఖర్మ ఇంతేనన్నారు. ఇక ప్రజలు నీ నాటకాలు నమ్మబోరని అన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. జగన్ మళ్లి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా కేంద్ర పథకం ద్వారా సబ్సిడీపై అందించిన ట్రాక్టర్‌ను, రోటావేటర్‌ను లబ్ధిదారుడు సన్నిబోయిన ఎలీషాకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సన్నిబోయిన రిబ్కా, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఇసుకపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ఎరకం నూకారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ ఎరకం దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, స్థానిక నాయకులు ఎరకం సూర్యనారాయణ రెడ్డి, గొర్ల పోతన్న, కూతా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: నిజ జీవితంగా ప్రమాదాలు జరుగుతున్న సమయంలో ఏ విధంగా అప్రమత్తం అవుతామో అలాగే ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవడంతో పాటు వాటిపై ఆపద మిత్రలు అవగాహన పెంచుకోవాలని ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి చాంద్‌కుమార్, అగ్నిమాపక అధికారి రామకృష్ణంరాజు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అనకాపల్లి, విశాఖ, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు జరుగుతున్న 9వ రోజు శిక్షణలో మంగళవారం వారు పాల్గొన్ని పలు అంశాలను వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాలను నివారించడానికి, అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులను వివరించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా, జరిగిన సమయంలో తీసుకొవల సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఈటీసీలో ఐదు జిల్లాల్లో 1200 మందికి శిక్షణ ఇస్తున్నామని, శుక్రవారంతో ఆపద మిత్ర శిక్షణలు ముగుస్తాయని చెప్పారు. శిక్షణలో భాగంగా 9వ రోజు ఉదయం ఉండూరు గ్రామంలో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి వి.ప్రసాద్, కె.నిహారిక, మొహిద్దీన్, విప్పత్తుల నివారణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి పాల్గొన్నారు.

రైల్వే సిబ్బంది అనాలోచిత చర్యపై ఆగ్రహం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి ఫ్లైఓవర్ ఎక్కే మార్గంలో రైల్వే డ్రైను వైపు ఇటీవల తొలగించిన వృక్షాల కొమ్మలకు నిప్పు పెట్టారు. దాంతో మంటలు ఏమిటో అర్థం కాక స్థానికులు పరుగులు తీసారు. స్థానిక రైల్వే సిబ్బంది ఎండి పాయిన చెట్టు కొమ్మలకు నిప్పు పెట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ముఖ్య కూడలిలో నిప్పు పెట్టడంతో నిప్పు రవ్వలు ఎగిరి పడటంతో పాటు ఫ్లైఓవర్ ఆవరణ పొగతో కమ్మేసింది. స్థానిక సత్యనారాయణపురం ప్రజల ఆందోళన వ్యక్తం చేయడంతో రైల్వే సిబ్బంది మంటలను అదుపు చేశారు.